

ఊరందూరు ఉపాధ్యాయుడికి జాతీయ పురస్కారం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న సురేష్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కూనాటి సురేష్ గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. సాంఘికశాస్త్ర విభాగంలో సురేష్ పలు వినూత్న ఆవిష్కరణలతో ప్రత్యేక గుర్తింపు పొందారు. తెలుగు రాష్ట్రాల్లో సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ పుస్తకాల రచన, పలు యాప్‌ల రూపకల్పన, డిజిటల్ తరగతులకు పాఠ్యాంశాల తయారు లాంటి అంశాల్లో ప్రశంసలు అందుకున్నారు. శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిగే ముఖాముఖికి సురేష్ హాజరు కానున్నారు.

గురువు స్థానానికి ఎన్నటికీ గౌరవం తగ్గదు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 5: ఎన్ని తరాలు మారినా గురువు స్థానానికి గౌరవం తగ్గదని జేసీ విద్యాధరి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా విద్యాశాఖ-సమగ్రశిక్ష సంయుక్త ఆధ్వర్యంలో గురువారం చిత్తూరు జడ్పీ సమావేశ మందిరంలో జరిగి ఉపాధ్యాయ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. సమాజాభివృద్ధికి ఎంతమందినైనా తయారు చేసే శక్తి ఒక ఉపాధ్యాయుడికే ఉంటుందన్నారు. గురువులు లేని సమాజం అర్థం లేనిలేనిదని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. నేటి విద్యార్థులకు సత్ప్రవర్తనతో పాటు నైతిక విలువలు నేర్పించడం ఎంతో ముఖ్యమని ఉపాధ్యాయులకు జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ గుర్తుచేశారు. చెడు అలవాట్లకు, మాదక ద్రవ్యాలకు విద్యార్థులను దూరం చేసేలా వారిలో చైతన్యం కల్పించాలని సూచించారు. అంతకు ముందు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి అతిథులు నివాళులర్పించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. జిల్లావ్యాప్తంగా 60 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయగా.. ఈ కార్యక్రమానికి హాజరైన 59 మందికి పురస్కారాలను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, డీఈవో దేవరాజు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతి, డీవైఈవో చంద్రశేఖర్, ఎంఈవో సెల్వరాజ్, మోహన్, విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.





ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకే పెద్దపీట



- శనివారం వేకువన 3 గంటల నుంచే దర్శనం
- కాణిపాక ఆలయ ఈవో గురుప్రసాద్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 5: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తులకే పెద్దపీట వేయనున్నట్లు ఆలయ ఈవో గురుప్రసాద్ పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో 14 గ్రామాలకు చెందిన ఉభయదారులదే కీలక పాత్ర అని పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడారు. వినాయక చవితి రోజున స్వామి దర్శనానికి 80 వేల మంది భక్తులు రావచ్చని అంచనా వేశామన్నారు. ఆ రోజున వీఐపీలు, సామాన్య భక్తులందరికీ ఒకేలాగా స్వామి దర్శనం కల్పిస్తామని స్పష్టం చేశారు. శనివారం వేకువ జామున 2 గంటలకు ఉభయదారుడు గాలిమునస్వామినాయుడు ఆధ్వర్యంలో మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించి స్వామి అలంకారం పూర్తి చేశాక 3 గంటల నుంచి భక్తులను స్వామి దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపారు. స్వామి దర్శనం కోసం ఉచితం, రూ.100, రూ.150 దర్శన క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు ఈవో వివరించారు. భక్తుల సౌకర్యార్థం చవితి రోజున భక్తులకు ఉదయం 9 గంటలకు అల్పాహారం, మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5 గంటల వరకు భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లోనూ నిత్యాన్నదానాన్ని నిర్వహిస్తామన్నారు. స్వామి దర్శనార్థం విచ్చేసే చంటి పిల్లల తల్లులు, వృద్ధులు, ప్రత్యేక అవసరాలున్న వారికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయం వద్ద ఎక్కడా భక్తులు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. 21 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో భక్తులకు అవసరమైన వైద్య సేవలు అందించడానికి డాక్టర్‌ను, అంబులెన్సును అందుబాటులో ఉంచుతామన్నారు. ఆలయానికి విచ్చేసే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాలని సూచించారు. భక్తుల కోసం లక్ష లడ్డూలను సిద్ధం చేశామన్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపలకు భక్తులు విచ్చేయగానే వారు దగ్గర్లోని లడ్డూ కౌంటర్లలో కొనుగోలు చేసుకోవాలన్నారు. ఆలయం వద్ద అవసరమైన సీసీ కెమరాలను అమర్చామన్నారు. భక్తులకు అవసరమైనన్ని బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లను శుక్రవారానికి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆలయం వద్ద పోలీసులు కమాండ్ కంట్రోల్లో సీసీ టీవీలను పర్యవేక్షిస్తూ భద్రత కల్పించాలని ఆయన సూచించారు.

గళం విప్పినా ప్రయోజనం ఏముంది?

- ఎమ్మెల్యేల ఆదేశాలను పట్టించుకోని అధికారులు
- గత సమావేశంలో ప్రస్తావించిన సమస్యలు నేటికీ పరిష్కారం కాని వైనం
- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యేలు పలు సమస్యలను ప్రస్తావించారు. రెండు నెలలైనా 90 శాతానికిపైగా పరిష్కారం కాలేదు. వీరి మాటలను అధికారులు పట్టించుకోవడంలేదు. అలాంటప్పుడు జడ్పీ సమావేశాల్లో గళం విప్పినా ప్రయోజనం ఏముందన్నది ఎమ్మెల్యేల ప్రశ్న. శుక్రవారం జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంలో అధికారులు దీనికి ఏం జవాబు చెబుతారో మరి. ఈసారైనా సభ్యులు ప్రస్తావించే సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

- చిత్తూరు రూరల్

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జూలై 3వ తేదీన జరిగిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలంతా హాజరయ్యారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, సమస్యలపై గళం విప్పిన తీరు చూసి అధికారులకు చమటలు పట్టాయి. తర్వాత సమావేశానికి సమస్యలు పరిష్కారం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఫలితం లేదు. దీన్ని బట్టి అధికారులు ఎమ్మెల్యేలకు ఎంత విలువనిస్తున్నారో ఇట్టే అర్థమవుతోంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలైనా ఇంకా చాలా శాఖల్లో అధికారులు, సిబ్బంది బదిలీలు జరగలేదు. ఇప్పుడున్న వారంతా వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన వారే. దీంతో ఎమ్మెల్యేలు చెప్పినా అధికారులు వినడం లేదనేది స్పష్టంగా తెలుస్తోంది. ఆ మధ్య పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ సిఫార్సు లేఖను డీఈవో దేవరాజు పట్టించుకోకుండా, దాన్ని తెచ్చినవారికి కూడా షోకాజ్ ఇవ్వడం సంచలనంగా మారింది. అలాగే జిల్లాలో చాలాచోట్ల ఎమ్మెల్యేలు అడిగిన తహసీల్దార్లు, ఎస్‌ఐ, సీఐలకు పోస్టింగులు ఇవ్వలేదు. దీంతో మా పనులు కావడం లేదని ఎమ్మెల్యేలు ఆవేదన చెందుతున్నారు. అధికారంలో ఉండీ ఉపయోగం లేదంటున్నారు.




కొత్త అధికారులు వస్తేనే?

గత సమావేశంలో ఎమ్మెల్యేలు ప్రస్తావించిన సమస్యలు పరిష్కారం అవ్వకపోవడానికి ప్రధాన కారణం బదిలీలు జరగకపోవడమేనని తెలుస్తోంది. కొత్త టీమ్ వస్తే పనులు చురుగ్గా జరుగుతాయని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ఆగస్టు 31 నాటికి బదిలీలు పూర్తి చేస్తారనుకుంటే పింఛన్ల పంపిణీ కోసం సెప్టెంబరు 15 వరకు వాయిదా వేశారు. ఇప్పుడు బదిలీల కన్నా విజయవాడ వరద బాధితులను ఆదుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉంది. దీంతో సెప్టెంబరు 15 నాటికీ బదిలీలు పూర్తి అవ్వడం అనుమానమే.

గత సమావేశంలో ప్రస్తావించిన సమస్యలివీ

- జిల్లాలో పలు శాఖల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలన్నీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి అనుచరులకే కేటాయించారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులకు ఫిర్యాదు చేశారు. తుమ్మలగుంట చెరువు అభివృద్ధి పేరిట అక్రమంగా పార్కులు, కట్టడాలు నిర్మించడం వల్ల గతంలో కురిసిన వర్షాలకు తిరుపతి నగరం సగం మునిగిపోయిందన్నారు. ఈ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. దీనిపై చర్యలు తీసుకోకుంటే వరద సమయాల్లో తిరుపతి మరో విజయవాడలా మారే అవకాశం ఉంది.
- 2014-19 నాటి టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు ఇంకా బిల్లులు చెల్లించలేదని గత సమావేశంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల ప్రస్తావించారు. వెంటనే బిల్లులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించినా వారు పట్టించుకోలేదు. కేవలం టీడీపీ వారనే కారణంగా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చి మూడు నెలలు పూర్తయినా బిల్లులు చెల్లించలేదు.
- అర్హత లేకున్నా తమ నియోజకవర్గాల్లో అనేక మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలకు వికలాంగ, డీఎంహెచ్‌వో పింఛన్లు పొందుతున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాటి సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పలు ఉదాహరణలు చూపారు. ఇంకా జిల్లాలో చాలామంది అనర్హులకు పింఛన్లు అందుతూనే ఉన్నాయి.

సత్యవేడు ఎమ్మెల్యేకి షాక్



- లైంగిక వేధింపుల ఆరోపణలపై టీడీపీ అధినేత తక్షణ చర్యలు
- ఇదంతా కుట్ర అంటున్న ఆదిమూలం
- మద్దతుగా నిలబడ్డ కుటుంబసభ్యులు

తిరుపతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):తనను లైంగికంగా వేధించారంటూ ఓ తెలుగు మహిళ నాయకురాలు చేసిన ఆరోపణల నేపథ్యంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని టీడీపీ నుంచీ సస్పెండ్ చేయాలని జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశించారు. దీంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు పార్టీ నుంచీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.తెలుగు మహిళ నాయకురాలు చేసిన ఆరోపణలను అధినేత సీరియస్‌గా తీసుకున్నారు. అందులో నిజానిజాలు, ఆరోపణల వెనుక ఇతర కోణాలు వంటివి ఏవైనా వుంటాయా అన్న విషయం కూడా అధినేత పరిగణనలోకి తీసుకోలేదు. మహిళా నేత నుంచీ తీవ్ర ఆరోపణ రావడంతో వరద సహాయక చర్యల్లో నిమగ్నమై వున్నా కూడా ఆ అంశంపై దృష్టి సారించారు.సస్పెన్షన్‌కు ఆదేశించిన అధినేత ఆరోపణల గురించి పార్టీపరంగా అంతర్గత విచారణకు ఆదేశించారు.గురువారం ఉదయం నుంచీ సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ఈ అంశం వైరల్ అవుతుండడంతో జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఆత్మరక్షణ ధోరణిలో పడ్డాయి. అంతలోనే అధినేత స్పందించిన తీరు శ్రేణులను తలెత్తుకునేలా చేసింది. నిజానికి ఆరోపణలతో పార్టీ గ్రాఫ్ తగ్గాల్సిన పరిస్థితుల్లో అధినేత నిర్ణయం సామాన్య జనంలో కూడా పార్టీ ఇమేజిని పెంచింది.

తొలుత వ్యతిరేకించి... తర్వాత సమర్థించి

ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన తెలుగు మహిళ నాయకురాలు గత ఎన్నికల్లో ఆయనకు టికెట్ ఇవ్వడాన్ని వ్యతిరేకించారు.టీడీపీ టికెట్ డాక్టర్ హెలెన్‌కు కాకుండా ఆదిమూలానికి ప్రకటించడంతో నిరసించిన ఆమె తర్వాత సమర్థించారు. తీరా ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేయలేదని ఆదిమూలం నుంచే విమర్శలు ఎదుర్కొన్నారు. ఫలితాల తర్వాత ఎమ్మెల్యే వెంట నడిచారు. మూడు నెలలు కూడా గడవకనే అదే ఎమ్మెల్యే మీద లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. నాలుగైదు నెలల్లోనే పలు మలుపులు తిరిగిన ఈ వ్యవహారంలో కేంద్ర బిందువుగా మారిన ఆమెది కేవీబీపురం మండలం.2020లో అప్పటి సత్యవేడు టీడీపీ ఇంచార్జి జేడీ రాజశేఖర్ అనుచరురాలిగా రాజకీయాల్లోకి వచ్చిన ఆమె తర్వాత డాక్టర్ హెలెన్ వర్గంలో చేరారు.ఆదిమూలానికి టికెట్ ప్రకటించాక ఆయన తరపున ప్రచారం చేశారు.ఎన్నికల ఫలితాల తర్వాత ఎమ్మెల్యే వెంట కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చివరగా వారం కిందట కేవీబీపురంలో ఎమ్మెల్యే పాల్గొన్న కార్యక్రమానికి ఆమె గైర్హాజరయ్యారు. ఇలా వీరి రాజకీయ సంబంధాలు అనేక మలుపులు తిరిగాయి. ఈ నేపథ్యంలో ఆమె గురువారం అకస్మాత్తుగా హైదరాబాదులో మీడియా ఎదుట ఎమ్మెల్యేపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం కలకలం రేపింది.ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయ చరిత్రలో ఓ ఎమ్మెల్యే లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొనడం, పార్టీ నుంచీ సస్పెండ్ కావడం ఇదే తొలిసారి. ఈ ఘటన జిల్లాకు తలవంపులుగా మారిందనే చెప్పాలి.

సర్పంచి నుంచి ఎదిగి.. ఒక్కసారిగా దిగజారి

సత్యవేడు, సెప్టెంబరు 5 : రాజకీయ ప్రస్థానంలో సర్పంచ్ స్థాయి నుంచి ఒక్కొక్క మెట్టు ఎదిగి ఎమ్మెల్యే స్థాయికి చేరుకున్న ఆదిమూలం ఒక్కసారిగా అప్రతిష్ట పాలయ్యారు.1978లో రాజకీయాల్లో అడుగు పెట్టిన ఆదిమూలం నారాయణవనం మండలంలోని తన స్వగ్రామం భీమునిచెరువు సర్పంచ్‌గా తొలిసారి 1980లో ఎన్నికయ్యారు. ఏకధాటిగా 15 సంవత్సరాలు సర్పంచ్‌గా కొనసాగారు. 1995 నుంచి 2006 వరకు వైస్ ఎంపీపీగా, జడ్పీటీసీగా ఎన్నికయ్యారు.2009 నియోజకవర్గ పునర్విభజనలో బాగంగా సత్యవేడు నియోజకవర్గంలో నారాయణవనం కలవడంతో టీడీపీ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డారు. తరువాత కాంగ్రెస్, వైసీపీలో కొనసాగారు. 2014 ఎన్నికల్లో సత్యవేడు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ఆదిమూలం 2019 ఎన్నికల్లో గెలుపొందారు. 2024 ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి పెద్దిరెడ్డితో విభేదించి వైసీపీ నుంచి బయటకు వచ్చి టీడీపీలోకి చేరి టికెట్ సంపాదించారు.అయితే వైసీపీ ఎమ్మెల్యేగా ఐదేళ్ళ కాలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఆయన అక్రమ కేసులు పెట్టి వేధించారంటూ మెజారిటీ నాయకులు ఆయన అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో కొంతమంది టీడీపీ నాయకులు ఇండిపెండెంట్ అభ్యర్థి రమేష్‌బాబుకు పనిచేశారు.అయితే కూటమి ప్రభంజనంలో ఆదిమూలం గెలుపొందారు.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదిమూలం తనను లైంగికంగా వేధించారని ఓ తెలుగు మహిళా నాయకురాలు ఆరోపిస్తూ అందుకు సంబంధించిన వీడియో టేప్‌లను మీడియాకు ఇవ్వడంతో ఆయన అసలు రంగు బయటపడింది. దీంతో ఆయన ఒక్కొక్క ఇటుక పేర్చి కట్టుకున్న రాజకీయ మేడ పేకమేడలా ఒక్కసారిగా కుప్పకూలినట్లు అయిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

సమసిపోని వ్యతిరేకత

ఆదిమూలం ఎమ్మెల్యేగా గెలిచి మూడు నెలలవుతున్నా కష్టపడిన నాయకులను, జెండా మోసిన కార్యకర్తలను విస్మరించి వైసీపీ వారికి మద్దతు ఇస్తున్నారని టీడీపీలోని ఓ వర్గం వాదిస్తోంది. గత ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థికి పని చేసిన వారందరినీ చెరకురసం (ఇండిపెండెంట్ అభ్యర్థి గుర్తు చెరకు) తాగారని దూషిస్తూ పూర్తిగా పక్కన పెట్టారని సమాచారం. అయితే అదే సమయంలో వైసీపీ నాయకులతో పాత బంధాలు కొనసాగిస్తూ చెట్టపట్టాలు వేసుకుని తిరుగుతున్నారని, సొంత పార్టీ నాయకులే ఆయనపై మీడియాకు ఎక్కారు.

అజ్ఞాతంలోకి ఎమ్మెల్యే ఆదిమూలం ఆరోపణలు కుట్రేనన్న కుటుంబం

తెలుగు మహిళ నేత ఆరోపణల వ్యవహారంలో ముందస్తు సమాచారం వుందో లేదో గానీ బుధవారం రాత్రి నుంచే ఎమ్మెల్యే ఆదిమూలం అజ్ఞాతంలోకి వెళ్ళినట్టు సమాచారం. సాధారణంగా ఎమ్మెల్యే కదలికలు, పాల్గొనే కార్యక్రమాల గురించి నియోజకవర్గవ్యాప్తంగా ముఖ్య నాయకులందరికీ సమాచారం వుంటుంది. కానీ గురువారం ఉదయం నుంచీ ఆయన ఆచూకీ ఎవరికీ తెలియలేదు.పుత్తూరు శివార్లలోని నివాసంలోనూ ఎవరూ అందుబాటులో లేరు. కుటుంబీకులతో పాటు వ్యక్తిగత సిబ్బంది కూడా లేకుండా పోయారు. ఎవరి ఫోన్లూ పనిచేయలేదు. దీంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారన్న ప్రచారం జరిగింది.ఎమ్మెల్యే ఒక ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధితో మాత్రం ఫోన్‌లో మాట్లాడి తనపై కుట్ర జరిగిందంటూ వివరణ ఇచ్చారు.తనకేమీ తెలియదని, తనపై కుట్ర జరిగిందని ఆరోపించారు. ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేశారని, తాను తప్పు చేయలేదని ఎక్కడైనా ప్రమాణానికి సిద్ధమని స్పష్టం చేశారు. తన బిడ్డల సాక్షిగా ఆమె తెలుగు మహిళా నాయకురాలిగా మాత్రమే తెలుసునని, ఇతర పరిచయాలు లేవన్నారు. ఇటీవలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడిన రమేష్‌బాబుతో పాటు పార్టీలోని మునుస్వామి యాదవ్, గిరిబాబు, బాలరాజు తదితర నాయకులు పన్నిన కుట్రగా ఆరోపించారు. అయితే ఆచరణలో ఎవరికీ అందుబాటులో లేకుండా అజ్ఞాతంలోకి వెళ్ళిపోవడంతో ఆయన వాదన బలహీనంగా మారింది.సాయంత్రానికి కుటుంబీకులు అందుబాటులోకి వచ్చారు. ఎమ్మెల్యే ఆదిమూలం సతీమణి గోవిందమ్మ మీడియాతో మాట్లాడుతూ తన భర్త చాలా మంచివాడన్నారు. రాజకీయాల్లో ఎంతో ఎత్తుకు ఎదిగిన తన భర్తను కొందరు కుట్రపన్ని ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిమూలం కుమారుడు, నారాయణవనం జడ్పీటీసీ సుమన్ కుమార్ మాట్లాడుతూ తన తండ్రికి టికెట్ రావడం ఇష్టంలేని టీడీపీలోని కొందరు వైసీపీ వాళ్ళతో చేతులు కలిపి కుట్రలు పన్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేకి ఆరోగ్యం బాగాలేనందున చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారని వ్యక్తిగత సిబ్బంది వెల్లడించారు. అంతకుమించి ఏ ఆస్పత్రి అన్న విషయం కూడా చెప్పలేదు. ఆ తర్వాత కుమార్తెలు, అల్లుడు కూడా ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. ఎప్పుడో జరిగినట్లున్న వీడియోను ఇప్పుడు ఎందుకు విడుదల చేశారో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. కూతురు వయసున్న ఆమె ఆరోపణలు చేయడం వెనుక కొంతమంది టీడీపీ, వైసీపీ నాయకులున్నారని, వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు.కాగా ఎమ్మెల్యే సొంత మండలమైన బీముని చెరువులో మహిళలు ఆదిమూలానికి మద్దతు తెలిపారు.ఆదిమూలంపై ఆరోపణల వెనుక మాజీ మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. ఎమ్మెల్యే పై ఆరోపణలు చేసిన మహిళ దిష్టిబొమ్మను దహనం చేశారు.



మీడియా ఎదుట ఆదిమూలం కుటుంబ సభ్యులు

వి.కోటలో 144 సెక్షన్ సడలింపు

- అల్లర్ల ఘటనలో ప్రధాన నిందితుడు ఆరిఫ్ అరెస్టు
- సర్పంచి చెక్ పవర్ రద్దు

వి.కోట, సెప్టెంబరు 5: వి.కోటలో 144 సెక్షన్‌ను అధికారులు గురువారం సడలించారు. మూడో రోజు పరిస్థితి అదుపులో ఉండటంతో దుకాణాలన్నీ తెరుచుకునేందుకు అనుమతి ఇచ్చారు. వి.కోట్ల అల్లర్ల ఘటన నేపథ్యంలో రెండు రోజులుగా దుకాణాలు పూర్తిగా మూతపడ్డాయి. సామాన్య ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాలో పోలీసు పహారా కొనసాగుతోంది. వి.కోట అల్లర్లకు కారకుడైన ప్రధాన నిందితుడు ఆరీఫ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి అతడికి 14 రోజుల రిమాండు విధించడంతో మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. ఇప్పటి వరకు నమోదైన కేసుల్లో ఇతర నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇక, ఈ ఘర్షణకు సంబంధించి నిందితులకు వి.కోట సర్పంచి, ఆమె కుటుంబీకులు సహకరించారన్న సమాచారంతో ఆమె చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ కలెక్టరు ఉత్తర్వులు ఇచ్చారు. పంచాయతీ పరిపాలనా సౌలభ్యం కోసం ఉప సర్పంచ్ అక్మల్‌బాషాకు ఎంపీడీవో కౌంటర్ సంతకంతో చెక్ పవర్‌ను కల్పించారు. అయితే, సోషల్ మీడియాలో మాత్రం పంచాయతీ కార్యాలయంలో అక్మల్‌బాషా సర్పంచిగా బాధ్యతలు తీసుకున్నారంటూ ఫొటోలు వైరల్ అయ్యాయి. దీంతో సర్పంచ్ పీఎస్ లక్ష్మి మాట్లాడుతూ.. చెయ్యని నేరాలకు తమను బాధ్యుల్ని చేసి చెక్ పవర్ రద్దు చేస్తూ వచ్చిన ఉత్తర్వులు సరికాదని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన తన స్థానంలో అధికారులు అవగాహనా రాహిత్యంతో చెక్ పవర్ అనగానే ఉప సర్పంచ్‌కు బాధ్యతలు ఇస్తున్నట్లు ప్రకటనలు రావడం పట్ల ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఎంపీడీవో మహ్మద్ రఫీ పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం పెట్టి.. కలెక్టర్ ఆదేశాల మేరకు చెక్ పవర్ మాత్రమే తాత్కాలికంగా రద్దుచేసి ఉప సర్పంచికి సైనింగ్ పవర్ ఇచ్చారన్నారు. సర్పంచ్‌గా పీఎస్ లక్ష్మినే కొనసాగుతారని వివరణ ఇచ్చారు. మరోవైపు సీఐ సోమశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ బాబు నేతృత్వంలో సాయుధ పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. ప్రజలు వదంతులు నమ్మొద్దని కోరారు. కాగా, శాంతి కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ర్యాలీ సమీపంలో కొందరు యువకులు వివాంట్.. జస్టిస్.. అంటూ నినాదాలు చేశారు. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకుని బైండోవర్ కేసులు పెట్టి తహసీల్దారు ఎదుట హాజరు పరచి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.



ఉత్తమ సేవలకు పురస్కారాలు

చిత్తూరు (సెంట్రల్): విద్యారంగంలో ఉపాధ్యాయులు అందించిన ఉత్తమ సేవలకు పురస్కారాలు లభించాయి. చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే థామస్, మేయర్ అముద, జేసీ విద్యాధరి తదితరులు 59 మంది ఉపాధ్యాయులను సన్మానించి, మెమెంటో, ప్రశంసాపత్రాలు అందించారు. సన్మానం అందుకున్న వారు..



హెచ్‌ఎం హస్సన్ బాషా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చిత్తూరు



హెచ్‌ఎం కేటగిరీ : ఎ.నారాయణ, శ్రీరామాపురం జడ్పీహెచ్‌ఎస్, పెద్దపంజాణి మండలం - ఎ.బాలచైతన్య, ముదరందొడ్డి జడ్పీహెచ్‌ఎస్, వి.కోట మండలం - బి.రామణరావు, నెల్లిపట్ల జడ్పీహెచ్‌ఎస్, బైరెడ్డిపల్లె మండలం - ఆర్.భారతి, ఎంసీహెచ్‌ఎస్, కేజీబీవీ, చిత్తూరు - టీఎన్ రమ, ప్రిన్సిపాల్, ఏపీఎంఎస్, పుంగనూరు - వెంకటనాగేశ్వర్, అడవిబుదుగూరు జడ్పీహెచ్‌ఎస్, కుప్పం - ఎ.శ్రీనివాసులు, జంబాడ జడ్పీహెచ్‌ఎస్, విజయపురం మండలం - బి.అరుణ్‌కుమార్, ఎం.పైపల్లి జడ్పీహెచ్‌ఎస్, ఐరాల మండలం - భాస్కర్‌రావు, 14 కండ్రిగ జడ్పీహెచ్‌ఎస్, యాదమరి మండలం

స్కూల్ అసిస్టెంట్ కేటగిరి : ఆర్‌ఎస్ మురళీ కృష్ణరాజు, కార్వేటినగరం జెడ్పీహెచ్‌ఎస్ (బి) - బి.సునీత, దేవళంపేట జడ్పీహెచ్‌ఎస్, వెదురుకుప్పం మండలం



స్కూల్ అసిస్టెంట్ కేటగిరి : కె.మాలిక్ మొయినుద్దీన్, పూనేపల్లి జడ్పీహెచ్‌ఎస్, పెనుమూరు మండలం - కె.నాదముని, పూతలపట్టు జడ్పీహెచ్‌ఎస్ - ఎంజీ శ్రీనివాసన్, వావిల్‌తోట జడ్పీహెచ్‌ఎస్, పూతలపట్టు మండలం - ఎన్.సిద్దయ్యశెట్టి, తలపులపల్లి జడ్పీహెచ్‌ఎస్, పూతలపట్టు మండలం - ఎస్.జగన్నాథరెడ్డి, యాదమరి జడ్పీహెచ్‌ఎస్ - సి.త్రివేణి, యాదమరి జడ్పీహెచ్‌ఎస్ - టీజీ రాజేష్, గూడూరుపల్లి జడ్పీహెచ్‌ఎస్, పుంగనూరు మండలం - ఎం.రఘుపతి, శంకరాయలపేట జడ్పీహెచ్‌ఎస్, పెద్దపంజాణి మండలం - బి.మంజులరాణి, గంటావూరు ఎంపీపీఎస్, పలమనేరు మండలం - ఇ.జాఫర్ బాషా, బొమ్మయ్యగారిపల్లె జడ్పీహెచ్‌ఎస్, రొంపిచెర్ల మండలం - ఎన్.శేఖర్, గరిగచేనుపల్లె జడ్పీహెచ్‌ఎస్, కుప్పం మండలం



స్కూల్ అసిస్టెంట్ కేటగిరి : ముక్కు చలపతి, లింగాపురం జడ్పీహెచ్‌ఎస్, వి.కోట మండలం - యు.వెంకటరామయ్య, పలమనేరు జీహెచ్‌ఎస్ - ఎస్.కాలేషు మస్తాన్, తాళంబేడు జడ్పీహెచ్‌ఎస్ - ఎస్.ఎం.ప్రభురాం, రామకుప్పం జడ్పీహెచ్‌ఎస్ - నాదముని, చవరంబాకం జడ్పీహెచ్‌ఎస్, నింద్ర మండలం - బి.లక్ష్మీపతి, జూనిపల్లి జడ్పీహెచ్‌ఎస్, వి.కోట మండలం - ఆర్.సిద్దారెడ్డి, రాళ్లబుదుగూరు జడ్పీహెచ్‌ఎస్, శాంతిపురం మండలం - కె.షణ్ముగం, గంగమాంబపురం జడ్పీహెచ్‌ఎస్, విజయపురం మండలం - ఎస్.కె.హేమలత, గోవిందపురం ఎంపీపీఎస్, వి.కోట మండలం - ఆర్.రమేష్‌బాబు, గిరింపేట ఎంసీహెచ్, చిత్తూరు

ఎస్జీటీ విభాగం : ఎస్.జ్యోతి, కొత్తవెంకటాపురం ఎంపీపీఎస్, జీడీ నెల్లూరు మండలం - బి.లత, వరదరాజులపల్లి ఎంపీపీఎస్, చిత్తూరు మండలం - పి.వరదయ్య, కొట్రకోన ఎంపీపీఎస్, జీడీ నెల్లూరు మండలం - కె.గోవిందయ్య, కత్తెరపల్లి ఎంపీపీఎస్, కార్వేటినగరం మండలం - జె.రాబర్టు జయశీలన్, దేవకండ్రిగ ఎంపీపీఎస్, కార్వేటినగరం మండలం - ఇ.కోదండయ్య, ఈవీడీపురం ఎంపీయూపీఎస్, పాలసముద్రం మండలం - కె.భువనేశ్వర్‌రెడ్డి, తెల్లగుండ్లపల్లె ఎంపీయూపీఎస్, తవణంపల్లె మండలం - కె.సుశీలమ్మ, ఎన్ఆర్‌పల్లె ఎంపీపీఎస్, తవణంపల్లె మండలం



ఎస్జీటీ విభాగం : ఎం.ఎన్.శేఖర్, పెరియంబాడి ఎంపీపీఎస్, యాదమరి మండలం - టి.జానకి, తాళంబేడు ఎంపీపీఎస్, యాదమరి మండలం - సీఎం జయశ్రీ, గాండ్లకొత్తూరు ఎంపీపీఎస్, యాదమరి మండలం - కె.సుశీల, కొట్టాలం ఎంపీపీఎస్, యాదమరి మండలం - ఇ.మార్కొండయ్య, చీపురపల్లి ఎంపీపీఎస్, బంగారుపాళ్యం మండలం - ఎం.జ్ఞానశేఖర్‌నాయుడు, దేవకండ్రిగ ఎంపీపీఎస్, కార్వేటినగరం మండలం - ఎం.కోమల, ఎగువకంతల చెరువు ఎంపీపీఎస్, బంగారుపాళ్యం మండలం - హెచ్.త్రిలోక్ చందు, చీపురపల్లి ఎంపీపీఎస్, బంగారుపాళ్యం మండలం - జి.జమునరాణి, టీఎన్‌వీఆర్‌పురం ఎంపీపీఎస్, పాలసముద్రం మండలం - కె.వంశీకృష్ణ, ఎల్లసముద్రం ఎంపీపీఎస్, విజయపురం మండలం - జి.జయశంకర్, నేతంకండ్రిగ ఎంపీపీఎస్, నగరి మండలం - డి.లోకేష్, తంబిగానిపల్లి ఎంపీపీఎస్, కుప్పం మండలం - జి.నారాయణ, పలమనేరు జీహెచ్‌ఎస్ - ఎం.ఆర్.సునంద, కొట్టాలం ఎంపీపీఎస్, యాదమరి మండలం - కె.మంజుల, చిత్తూరు ఎంసీపీఎస్ - కె.జానకి, బాలనత్తం ఎంపీయూపీఎస్, రామకుప్పం మండలం - ఎ.కేశవులు, డీకేపల్లి ఎంపీపీఎస్, కుప్పం - బి.సుజాత, గంద్రాజుకుప్పం ఎంపీపీఎస్, నగరి మండలం

జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో చెకుముకి సైన్స్ సంబరాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 5: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం జడ్పీ సమావేశ మందిరంలో జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఈవో దేవరాజు, ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్, యూటీఎఫ్, జేవీవీ నాయకులు రమణ, బాలచైతన్య పాల్గొన్నారు.

బెస్తపల్లెలో బాలికకు డెంగీ

ఐరాల, సెప్టెంబరు 5: మండలంలోని 35యర్లపల్లె పంచాయతీ బెస్తపల్లెకు చెందిన భానుప్రకాష్ కుమార్తె జ్యోతిర్మయి(11)కి డెంగీ సోకినట్లు జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి రామచంద్రారెడ్డి, జిల్లా సబ్ యూనిట్ మలేరియా అధికారి పీరు సాహెబ్ తెలిపారు. వారు గురువారం గ్రామాన్ని సందర్శించి, పారిశుధ్యాన్ని పరిశీలించారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. పలువురికి జ్వర పరీక్షలు నిర్వహించారు. అక్కడక్కడా నిల్వ ఉన్న నీటిలో అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న బావిని పూడ్చి వేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. బాలికకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఇంటి వద్దే వైద్యం చేయిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ మల్లీశ్వరి వారి వెంట ఉన్నారు.



బావిని పూడ్చి వేయాలని సూచిస్తున్న రామచంద్రారెడ్డి

నలుగురు దొంగల అరెస్టు

- రూ.3 లక్షల సొత్తు స్వాధీనం



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 5: చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనుల వద్ద రోడ్డు నిర్మాణానికి వినియోగించే సెంటరింగ్ ఇనుప షీట్లను గతనెల 31వ తేదీ గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. హైవే మేనేజర్ ఫిర్యాదు మేరకు బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. బుధవారం పాలేరు ఫ్లైవోవర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన బైరెడ్డిపల్లి మండలం జంగాల అగ్రహారానికి చెందిన నేతాజీ, చిత్తూరు రూరల్ మండలం కమ్మపల్లికి చెందిన కుమార్, ప్రకాష్, వేణుగోపాల్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం అంగీకరించడంతో అరెస్టు చేశారు. వారి వద్ద రూ.3 లక్షల విలువ చేసే ఇనుప షీట్లు, రూ.9 లక్షల విలువ చేసే టాటా వాహనాన్ని, రూ.4 లక్షల విలువ చేసే రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ఎర్రచందనం రూటు మారింది!

- చెన్నై నుంచి గౌహతికి తరలిస్తున్న 140 దుంగల సీజ్
- ఐదుగురు స్మగ్లర్లు, లారీ డ్రైవర్, క్లీనర్లను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్

తడ, సెప్టెంబరు 5 :చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై పట్టపగలు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. చెన్నై నుంచి ఎర్రచందనం అక్రమంగా రవాణా జరుగుతుందన్న సమాచారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులకు అందింది.సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓ బృందం జాతీయ రహదారిపై నిఘాపెట్టింది.గురువారం మధ్యాహ్నం సమయంలో చెన్నై నుంచి తడ వైపు ఓ వేగనార్ కారు ముందు వెళ్తుండగా దాని వెనుకనే ఒక ఐసర్ కంటైనర్ లారీ వెళ్తుండటాన్ని గుర్తించి టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంట పడ్డారు.వేగంగా వెళ్తున్న లారీని, కారును తడ మండలం బోడిలింగాలపాడు మలుపు దాటిన తరువాత టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ముందుగా కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు.లారీలోని డ్రైవర్‌ను, క్లీనర్‌ను అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. కంటైనర్ లారీలో ముందుపక్క అట్ట బాక్స్‌లు వెనుక ఎర్రచందనం దుంగలు ఉండటం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చి అప్పటికప్పుడు అక్కడికక్కడే పంచనామా నిర్వహించారు. సుమారు 140 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని నిమిషాల వ్యవధిలోనే అక్కడ నుంచి ఆ వాహనాలను, స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్కడ నుంచి తరలించుకువెళ్లారు. దీనిపై సీఐ సురేష్‌కుమార్‌రెడ్డిని వివరాల కోసం ప్రశ్నించగా ఆయన వివరాలు తెలిపేందుకు నిరాకరించారు.





స్మగ్లర్లు వినియోగించిన కారు - ఎర్రచందనంతో పట్టుబడ్డ లారీ

చెన్నై వదిలి గౌహతికి వెళ్లడమా...?

చైనా, జపాన్ దేశాల్లో విపరీతమైన డిమాండ్ వున్న ఎర్రచందనాన్ని దశాబ్దాలుగా చెన్నైకి తరలించి అక్కడినుంచి ఇతర దేశాలకు స్మగ్లింగ్ చేస్తుంటారు.అయితే గురువారం పట్టుబడ్డ ఎర్రచందనం చెన్నై వదిలి గౌహతికి వెళ్లడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చైనా, జపాన్‌కే కాకుండా ఏ దేశానికి రవాణా అవుతోందా అని ఆరా తీస్తున్నారు.

పొన్నూరులోని వెండి దుకాణంలో భారీ చోరీ

గాదంకి టోల్‌ప్లాజా వద్ద పట్టుబడ్డ ఇద్దరు నిందితులు - పరారీలో మరో ఇద్దరు - కారుతోపాటు రూ.30 లక్షల ఆభరణాల స్వాధీనం





పట్టుబడిన నిందితులు - పొన్నూరు పోలీసులకు ఆభరణాలు అప్పగిస్తున్న చంద్రగిరి పోలీసులు

చంద్రగిరి, సెప్టెంబరు 5: గుంటూరు సమీపంలోని పొన్నూరు పట్టణంలో ఉన్న ఓ వెండి దుకాణంలో భారీ చోరీ జరిగింది. వీరిలో ఇద్దరు నిందితులను గాదంకి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. మరో ఇద్దరు పరారవగా, కారుతోపాటు రూ.30లక్షల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పొన్నూరు పట్టణం గాంధీబొమ్మ సెంటర్‌కు సమీపంలోని తోటలమ్మ గుడి పక్కనే వెండి, బంగారు ఆభరణాలు విక్రయించే ధనలక్ష్మీ జ్యూవెలర్స్ ఉంది. బుధవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఓ కారులో ఆరుగురు వ్యక్తులు వచ్చి దుకాణం షట్టర్ పగలగొట్టి లోనికి చొరబడ్డారు. అనంతరం ఆభరణాలను మూటలు కట్టి కారులో వేస్తుండగా, ఆ వీధిలో వినాయక చవితి పండుగకు పందిళ్లు వేస్తున్న కేజీఎస్ యూత్ సభ్యులు గమనించారు. యువకులు దుకాణం వద్దకు వెళ్లడంతో దుండగులు పారిపోయేందుకు యత్నించారు. యువకులు ధైర్యంచేసి వెంటాడి రతన్ సింగ్ అనే దుండగుడిని పట్టుకున్నారు. ఇతడిని విడిపించడానికి ఇద్దరు దుండగులు కారు దిగి వచ్చారు. యువకులపై దాడి చేయగా, వారు ప్రతిఘటించడంతో పరారయ్యారు. సమాచారం అందుకున్న అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పట్టుబడ్డ రతన్ సింగ్‌ని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిచ్చిన సమాచారంతో కారు దిగిన ఇద్దరు నిందితులను తెనాలిలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల సెల్‌ఫోన్ ఆధారంగా కారులో పరారైనవారు బెంగళూరుకు వెళుతున్నట్లు గుర్తించి చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో వెళ్లి గాదంకి టోల్‌ప్లాజా వద్ద నిఘా ఉంచారు. నిందితులు ప్రయాణిస్తున్న కారు గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో రాగానే టోల్‌ప్లాజా సిబ్బందితో కలిసి వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరు అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. కారును పరిశీలించగా, రూ.30 లక్షల విలువైన వెండి ఆభరణాలు కనిపించాయి. కారుతోపాటు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను, కారు, ఆభరణాలను చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం పొన్నూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు గురువారం రాత్రి 10 గంటల సమయానికి చంద్రగిరికి చేరుకున్నారు. వీరికి ఇద్దరు నిందితులు, ఆభరణాలు, కారును చంద్రగిరి పోలీసులు అప్పగించారు.

బంగారుబల్లి కనిపించింది



తిరుమల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శేషాచలం కొండల్లో అరుదుగా కనిపించే బంగారుబల్లి గురువారం ముగ్గురు వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్ల కెమెరాలకు చిక్కింది. పక్షుల ఫొటోలు తీయడానికి తిరుపతి సమీపంలోని కళ్యాణి డ్యాం అటవీ ప్రాంతంలో తిరుగుతున్న ఫొటోగ్రాఫర్లు కార్తీక్‌సాయి, ఐనేష్ సిద్దార్థ, గోపి లక్కల దీనిని చూసి క్లిక్ మనిపించారు. అంతరించిపోతున్న బంగారుబల్లి పశ్చిమ కనుమల్లో ప్రధానంగా తిరుమల కొండల్లో లోతట్టు ప్రాంతాల్లో మాత్రమే సంచరిస్తుంటుంది. మూడు దశాబ్దాల కిందట బీ.వి. రమణ బంగారు బల్లిని ఫొటో తీయగా, రెండేళ్ల కిందట కార్తీక్ సాయి దీన్ని కెమెరాలో చిత్రించారు. ఇప్పుడు మళ్లీ కళ్యాణీడ్యాం ప్రాంతంలో బంగారుబల్లి దర్శనమిచ్చింది.

గట్టువారిపల్లె వద్ద ఏనుగుల సంచారం

సోమల, సెప్టెంబరు 5: మండలంలోని గట్టువారిపల్లె సమీప పొలాల వద్ద బుధవారం రాత్రి ఏనుగులు సంచరించాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గట్టువారిపల్లె చెరువుకోన సమీపంలో రెండు రోజులుగా మకాం వేసిన ఏనుగులు పగలు అడవిలో ఉండి రాత్రి పొలాలను తొక్కి ధ్వంసం చేస్తున్నాయి. కొందరి మామిడి తోటలో డ్రిప్ పరికరాలు, మామిడి కొమ్మలు విరి చేశాయి. సురేంద్ర, వెంకట్రామయ్యకు చెందిన వరి పొలాలను తొక్కివేశాయి. కాగా నెల క్రితం ఈ ప్రాంతంలో వేసిన వరి నాట్లను అప్పట్లో ఏనుగులు తొక్కేశాయి. తర్వాత మళ్లీ ఇప్పుడు నాట్లు వేశారు. ప్రస్తుతం మళ్లీ ఏనుగులు రావడంతో రైతులు దిక్కుతోచక తలలు పట్టుకుంటున్నారు. అటవీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఏనుగులు ధ్వంసం చేసిన వరి పొలం

మఠం భూముల్లో అక్రమ నిర్మాణాల తొలగింపు





ఎక్స్‌కవేటర్లతో తొలగిస్తున్న అక్రమ నిర్మాణాలు

తిరుపతి రూరల్, సెప్టెంబరు 5: తిరుపతి రూరల్ మండలం అవిలాల లెక్క దాఖలా వేదాంతపురం పంచాయతీ విద్యుత్‌నగర్ సర్వే నెంబరు 364, 368/1లోని హథీరాంజీ మఠం భూముల్లో అక్రమ నిర్మాణాలను గురువారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులతో కలసి భారీ పోలీసు బందోబస్తు నడుమ ఎక్స్‌కవేటర్ల సాయంతో మఠం అధికారులు తొలగించారు. ఈ సర్వే నెంబర్లలో మఠానికి సంబంధించి దాదాపు 26 ఎకరాల భూమి (364లో 18-90 ఎకరాలు, 368/1లో 7.70ఎకరాలు) ఉంది. ఈ భూముల్లో శివానాయక్ తన అనుచరులతో కలసి శ్రీస్వామి హథీరాంజీ బావాజీ మఠం పరిరక్షణ సమితి పేరుతో సంస్థను ఏర్పాటు చేసి.. హథీరాం బావాజీ ఆలయ శాశ్వత నిర్మాణంతోపాటు పలు తాత్కాలిక రేకుల షెడ్లను నిర్మిస్తున్నారు. ఇదేస్థలంలో ఓ అమ్మవారి ఆలయ నిర్మాణం కూడా చేపడుతున్నారు. అత్యంత ఖరీదైన మఠం భూములు 26 ఎకరాలు ఆక్రమణకు గురవుతుందన్న సమాచారంతో కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఎస్పీతో మాట్లాడి బలగాలను భారీగా మొహరించి.. అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ రవిమనోహర్ ఆచారి తదితరుల నేతృత్వంలో దాదాపు 10 ఎక్స్‌కవేటర్ల సాయంతో ఈ అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ నిర్మాణాల కోసం ఉపయోగించిన సిమెంటు రాయి, ఇతర వేస్ట్ మెటీరియల్‌ని ట్రాక్టర్ల ద్వారా అక్కడినుంచి పూర్తిస్థాయిలో తొలగించారు. మరోవైపు శివానాయక్ తన అనుచరులతో కలసి కూల్చివేతను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. కాగా ఆలయాల నిర్మాణాలను మాత్రం తొలగించలేదు.

మఠం పేరుతో సంస్థ ఏర్పాటు చట్టరీత్యానేరం

హథీరాంజీ మఠానికి సంబంధం లేని వ్యక్తులు మఠం పేరుతో సంస్థను ఏర్పాటు చేయడం చట్టరీత్యానేరం. శివానాయక్, హరిప్రసాద్‌నాయక్, కిశోర్‌నాయక్ తమ అనుచరులతో కలసి విద్యుత్‌నగర్‌లోని మఠం భూముల్లో నిర్మాణాలను చేపట్టారు. పనులు ఆపేందుకు ప్రయత్నించగా మఠం సిబ్బందిపై దౌర్జన్యం చేశారు.శివానాయక్ సంస్థపేరుతో గుడి నిర్మాణం కోసం బంజారా కులస్తులను మోసగించి, వారివద్ద డబ్బులు వసూలు చేయడంతోపాటు భూమిని కబ్జా చేసేందుకు మహంత్ అర్జున్‌దాస్ సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు దానపత్రంతో కోర్టులు, అధికారుల ద్వారా లబ్ధి పొందేందుకు ప్రయత్నించారు. ఈభూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్ వేసి ప్లాట్లని విక్రయించి.. సామాన్య ప్రజలను మోసం చేశారన్న సమాచారం ఉంది. దీంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశాం. ప్రజలు కూడా మఠం భూములను కొని, మోసపోవద్దు.

- కేఎస్ రామారావు, హథీరాంజీ మఠం పరిపాలనాధికారి

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


పరమహంస యోగానంద విద్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించుకుంటున్న టీచర్లు

శాంతిపురం, సెప్టెంబరు 5: శాంతిపురం మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. సర్వేపల్లె రాధాకృష్ణ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. మండలంలోని పది మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి మండల సచివాలయంలో సన్మానించారు. బహుమతులు అందించారు. పరమ హంస యోగానంద విద్యాలయంలో ఉపాధ్యాయులకు సాంస్కృతిక పోటీలు నిర్వ హించి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే మండలంలోని ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీవో కుమార్, తహసీల్దార్ శివయ్య, ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యా యులు ధనంజయ, నాగ రాజు, రాధాకృష్ణ, చంద్రశేఖర్‌నాయుడు, సీఆర్‌పీలు, పరమ హంస యోగానంద విద్యాలయ ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి సమష్టిగా కృషిచేయండి

గంగవరం, సెప్టంబరు 5: ప్రతిబూత్ పరిధిలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పలమనేరు అర్బన్, రూరల్‌లో చేపట్టారు. కనీసం ఒక బూత్‌లో 200 మంది సభ్యత్వం కలిగి ఉండేలా కృషిచేయాలన్నారు. అనంతరం బైరెడ్డిపల్లి మండలం ఆలపల్లి వెంకట్రామిరెడ్డి, పలమనేరు నుంచి జగదీష్, వెంకటేష్, సర్వర్, మున్నా తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటముని, శరవణ, విజయకుమార్, ప్రభాకర్, గేట్‌బాబు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేది ఉపాధ్యాయులే

రామకుప్పం, సెప్టెంబరు 5: భావితరాల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ తెలిపారు. గురువారం రామకుప్పంలో విద్యాశాఖ నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం వారు మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఎంఈవో నారాయణప్ప, తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహా, జనసేన మండల అధ్యక్షుడు హరీష్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తందానం చేసిన విద్యార్థులతో వైద్యులు

గంగవరం, సెప్టంబరు 5: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తే వారి ప్రాణాలు కాపాడినట్లే నని మదర్ థెరిసా కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. గురు వారం స్థానిక మదర్ థెరిసా కళాశాలకు చెందిన ఎన్ఎస్ ఎస్ విద్యార్థులు పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులను వైద్యాధికారి మమతారాణి, వైద్యులు శారద, యుగంధర్ తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉన్నతమైనది ఉపాధ్యాయ వృత్తి


సన్మానం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయ బృందం

సదుం, సెప్టెంబరు 5: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని సదుం ఎంఈవో శ్రీరాములు, ఎస్‌ఐ షేక్షావలి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాలలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. సర్వేపల్లె రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉత్తమ సేవలందించిన 10 మంది ఉపాధ్యాయులకు దుశ్శాలువలతో సత్కరించారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సుధాకర్‌రెడ్డి మాస్టారును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్, ఎస్‌టీయూ రాష్ట్ర నాయకులు మోహన్ కుమార్ రెడ్డి, ఎంఈవో-2 దామోదర్, హెచ్‌ఎం శ్రీరాములు నాయక్, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ పై విచారణ



చౌడేపల్లె, సెప్టెంబరు5: స్థానిక చిట్టిరెడ్డిపల్లెలో 12వ నంబర్ స్టోర్ డీలర్ అక్రమాలపై తహసీల్దార్ హనుమంతు విచారణ చేపట్టారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులంతా ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. విచారణలో తూకాలలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు డీలర్ ఒప్పుకున్నారని తెలియజేశారు. విచారణ నివేదికలను ఆర్డీవోకు పంపి ఆయన ఆదేశాలతో తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సుధాకర్‌నాయక్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే మార్గదర్శకులు


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజు

చౌడేపల్లె, సెప్టెంబరు 5: ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను స్థానిక ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన టీచర్స్‌డే సమావేశంలో ఎంఈవోలు కేశరెడ్డి, తిరుమలమ్మ మాట్లా డుతూ అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి గొప్పదన్నారు. టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజు మాట్లాడుతూ మండ లంలో ఏటా ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.10వేలు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

9 నుంచి రాయితీ విత్తన ఉలవల పంపిణీ

చౌడేపల్లె, సెప్టెంబరు9: రైతులకు రాయితీ విత్తన ఉలవలు ఈ నెల 9వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు ఏవో జ్యోతమ్మ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ 213 క్వింటాళ్ల ఉలవలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

సోమల, సెప్టెంబరు 5: గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ రమేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో నారాయణ మాట్లాడుతూ ఈ నెలాఖరులోపు వివిధ దశలోని నిర్మాణాలు నమోదు చేసి బకాయి బిల్లులు చెల్లించాలన్నారు. ఆర్థికస్థోమత లేని లబ్ధి దారులకు వెలుగు పథకంలో రుణాలు అందజేస్తామని వివరించారు. ఈ సమావేశంలో ఎంపీఎం శివ, ఏపీవో దినకర్‌బాబు, గణేశ్, అలీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

చౌడేపల్లె, సెప్టెంబరు5: వినాయక చవితి పర్వదినం సందర్భంగా వినాయక మండపాలు ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. గురువారం వారు తహసీల్దార్ కార్యాలయంలో వినాయక మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులతో మాట్లాడారు.

ఇళ్లు కోల్పోయినవారికి న్యాయం చేయండి


ఈవోకు వినతి పత్రం అందిస్తున్న వాడ గంగరాజు

చౌడేపల్లె, సెప్టెంబరు 5: గత వైసీపీ ప్రభుత్వంలో బోయ కొండలో ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని సీపీటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు కోరారు. ఈ మేరకు గురువారం ఆలయ ఈవో ఏకాంబరానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో స్థానికుల ఇళ్లు, షాపులను దౌర్జన్యంగా తొలగించింద న్నారు. వారికి ఎలాంటి నష్టపరిహారం ఇవ్వ లేదన్నారు. బాధితులకు నష్టపరిహారం ఇస్తామని చెప్పి ఐదేళ్లవుతున్నా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఈవో స్పందిస్తూ పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో బోయకొండ బాధిత కమిటీ సభ్యులు మణి, గంగాదేవి, శబరీష్ పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అతిథి ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం, సెప్టెంబరు 5: శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీ హెచ్‌డబ్ల్యూ అతిథి ఫ్యాకల్టీ పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ చేసిన మహిళ అర్హులని తెలియజేశారు. ఈ నెల 9వ తేదీలోపు ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రాజనాలబండకు రూ.4.47లక్షల ఆదాయం

చౌడేపల్లె, సెప్టెంబరు5: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాల బండ ఆంజనేయస్వామి ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.4.47 లక్షలు ఆదాయం చేకూరినట్లు ఆలయ ఏఈవో మునికృష్ణా రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాజనాలబండ తిరునాళ్ల సందర్భంగా రూ.4,47,134 నగదు హుండీ ద్వారా భక్తులు సమర్పించినట్లు తెలిపారు. ఈ ఆదాయాన్ని చౌడేపల్లె ఇండియన్ బ్యాంక్‌లో డిపాజిట్ చేసినట్లు తెలిపారు.

వరద బాధితులకు పది టన్నుల కూరగాయల వితరణ


కూరగాయల వాహనాన్ని విజయవాడకు పంపుతున్న నేతలు, రైతులు

రామకుప్పం, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితులకు కుప్పం నియోజకవర్గ తెలుగురైతు విభాగం, రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె పరస్పర రైతు సహకార సంఘం వారు 10 టన్నుల కూరగాయలను వితరణగా ఇచ్చారు. తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నకృష్ణలు కూరగాయల వాహనాన్ని విజయవాడకు పంపారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు మండల అధ్యక్షుడు కొళ్లపల్లెరమేష్, చెల్దిగానిపల్లె రైతు సంఘం నేతలు ఉమాపతి, వెంకటేష్, రెడ్డిపురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు


గుడుపల్లెలో ఉలవలను పంపిణీ చేస్తున్న బాబు

గుడుపల్లె, సెప్టెంబరు5: రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు అని టీడీపీ మండల అధ్యక్షులు బాబు పేర్కొన్నారు. గురువారం సబ్సిడీ ఉలవల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఉలవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 10 కేజీల ఉలవల ప్యాకెట్ 80 శాతం సబ్సిడీతో రూ.174కి అందిస్తున్నామన్నారు. జనసేన మండలాధ్యక్షుడు అమీర్ నాయకులు హేమాంబర్ గౌడ్, సుబ్ర హ్మణ్యం, గోపాల్, భానుమూర్తి, రామప్ప. విజయ్, మంజు నాథ్, లక్ష్మీపతి, మణికంఠ, దేవేంద్ర, అందరీష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 5 : మండలంలోని పెద్దచెల్లార గుంట జడ్పీఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం రవి కుమార్‌ను, ఉపాధ్యాయులను విద్యా ర్థులు సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవ ప్రాముఖ్యత గురించి పలువురు ప్రసంగించారు. అలాగే కడపనత్తం జడ్పీ ఉన్నత పాఠశాలలో కూడా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యా యులను సన్మానించారు. హెచ్‌ఎం నందగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి విశేషకృషి

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 5 : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషిచేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రఘుచంద్రగుప్తా అన్నారు. మండలంలోని లక్కనపల్లెలో గురువారం ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తున్న ఉలవలను రైతులకు పంపిణీ చేశారు. ఆర్‌బీకే సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆయిమాతా ఆలయ ఉత్సవాలు



వి.కోట, సెప్టెంబరు 5: వి.కోటలో వెలసిన ఆయి మాతా ఆలయంలో సీర్వీ సమాజ్ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారు వెలసి 609 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో జాగరణ, ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు అమ్మవారి సేవలో పాల్గొన్నారు. గురువారం రాత్రి జాగరణ సందర్భంగా భక్తి గీతాలాపన, భజనలు, సంప్రదాయ నృత్యాలతో రాజస్తానీ కుటుంబాలు సందడిగా గడిపారు. ఈ ఈ వేడుకలకు మండల పరిధిలోని అఖిలపక్షం నేతలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

సీఎం సహాయనిధికి రూ.1.50 లక్షల చెక్కు



గంగవరం, సెప్టంబరు 5: విజయవాడ వరద బాధితులకు గంగవరం శ్రీసాయి చైతన్య కళాశాల విద్యార్థులు అండగా నిలిచారు. గంగవరంలోని సాయిశ్రీ చైతన్య కళాశాల నుంచి విద్యార్థులు మదనపల్లె రోడ్డు, అంబేద్కర్ సర్కిల్, ఎంబీటీ రోడ్డు గుండా ర్యాలీ చేపట్టారు. హుండీలతో వ్యాపార కేంద్రాలు, స్థానిక ప్రజలను అభ్యర్థించారు. వసూలైన డబ్బుతో పాటు యాజమాన్యం మరింత వేసి మొత్తం రూ.1.5 లక్షల చెక్కును సీఎం సహాయ నిధికి పంపనున్నట్లు యాజ మాన్యం ప్రకటించారు. కళాశాల యాజమాన్యం ఎంవీఆర్ రెడ్డి, ప్రమోద్, కిషోర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే భావి భారత నిర్మాతలు


ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదిరులు

కుప్పం, సెప్టెంబరు 5: భావి భారతాన్ని నిర్మించేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. స్థానిక మండల సచివాలయంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరగతి గదిని ప్రయోగశాల చేయడంలో, ఆ ప్రయోగ శాల ద్వారా సమాజానికి ఉపయోగపడే విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తయారు చేయడంలో ఉపాధ్యాయులది ప్రధాన పాత్ర అని పేర్కొన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు ఉపాధ్యాయుల ప్రయోజనాలను పరిరక్షించడానికి ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. కడా పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ సమాజాన్ని గాడిలో పెట్టాలంటే విద్యార్థి దశలో యువతరానికి గురువులు చేసే బోధల ద్వారానే సాధ్యమని చెప్పారు. టీడీపీ నాయకులు పీఎస్.మునిరత్నం, డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, ఎంపీడీవో సాయి లహరి, ఎంఈవో మహబూబ్ బాషా, టీడీపీ కుప్పం మున్సిపల్, రూరల్ మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, ఇతర అధికార పార్టీ నాయకులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **ప్రభుత్వ వృత్తి కళాశాలలో..**

కుప్పంలోని ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల ప్రాంగణంలో సైతం గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లె రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ద్రావిడ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ ఎం.దొరస్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు విద్యార్థులకు బోధన సమాజానికి వెలుగులు పంచుతారని చెప్పారు. అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జగదీశ్‌బాబు, షహీన్ తాజ్, సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డినాయక్, ఏడు కొండలు, రిజ్వాన్, కార్తీక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతోనే మంచి సమాజ నిర్మాణం


సర్వేపల్లి రాధాక్రిష్ణ చిత్రపటానికి వందనం చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

గుడుపల్లె, సెప్టెంబరు5: ఉపాధ్యాయులతోనే మంచి సమాజ నిర్మాణం సాధ్యమని ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి పేర్కొన్నారు. ద్రావిడ విశ్వ విద్యాలయం ఎమినో భవనంలో సమావేశ హాలులో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. సర్వేపల్లి రాధాక్రిష్ణ చిత్రపటానికి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదన్నారు. ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శంగా ఉండాలన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఏదైనా మనకు తెలియని విషయాన్ని తెలియజెప్పే వాడే గురువని పేర్కొన్నారు. అది ఏ వృత్తిలో అయిన పనిలో అయినా ప్రతిఒక్కరూ గురువేనన్నారు. అయితే పాఠాలు చెప్పే గురువుకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో లభించే గౌరవం ఏ వృత్తిలోనూ దొరకదన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

సోమవారోత్సవాలు ప్రశాంతంగా నిర్వహిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

రామకుప్పం, సెప్టెంబరు 5: రామకుప్పం శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈ నెల 9నుంచి జరిగే సోమవారోత్సవాలు శాంతియుతంగా జరిగేలా అందరూ సహకరించాలని కుప్పం ఆర్డీఓ శ్రీనివాస రాజు, గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్ కోరారు. గురువారం రామకుప్పం పోలీస్ స్టేషనులో వివిధ పార్టీలు, మతపెద్దలతో నిర్వహించిన శాంతిసమితి సమావేశంలో వారు మాట్లాడారు. మత సామరస్యానికి ప్రతీకగా జరిగే సోమవారోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం తరపున, పోలీసుశాఖ తరపున తాము అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు, పుకార్లను ప్రచారం చేయకుండా మత పెద్దలు ప్రతి ఒక్కరినీ కట్టడి చేయాలన్నారు. ఉత్సవాల సందర్భంగా లేనిపోని పుకార్లు సృష్టించేవారు, అల్లర్లకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశం అనంతరం పట్టణ వీధుల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దారు బాబు, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయనాచారి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మెన్ సీతాపతి, ఇన్‌చార్జీ ఎస్‌ఐ నరేష్, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహా, జనసేన మండల అధ్యక్షుడు హరీష్, నేతలు రామ్మూర్తి, రామకృష్ణప్ప, అక్బర్‌సాబ్, పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో పండ్ల తోటలకు ప్రాధాన్యం


కొబ్బరి మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుమార్

శాంతిపురం, సెప్టెంబరు 5 : ఉపాధి హామీలో పండల్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీడీవో కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కెనమాకులపల్లె పంచాయతీ వెంకటేపల్లె గ్రామ సమీపంలో ఉపాధి హామీ పథకంలో నాటిన కొబ్బరి మొక్కలను ఆయన పరిశీలించారు. సక్రమంగా బిల్లులు అందుతున్నాయ అని కొబ్బరి రైతును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పలువురు రైతులతో మాట్లాడుతూ మండలంలోని చిన్న, సన్న కారు రైతులు ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటలు పెంచు కోవచ్చన్నారు. 2024-25 సంవత్సరంలో 163 ఎకరాలలో 102 మంది రైతులు కొబ్బరి, మామిడి మొక్కలు నాటారన్నారు. ఇంకా 122 ఎకరాల్లో వారం రోజుల్లో పూర్తి ప్లాంటేషన్ చేస్తామని వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎకరాకు రూ.1,76,500లు ఇస్తామని తెలియజేశారు. 16 రకాల పండ్ల తోటలు పెంచుకోవచ్చన్నారు.

లగేజీ ఆటో ఢీకొని 8మందికి గాయాలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు5: లగేజీ ఆటో ఢీకొని మరో ఆటోలోని ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. అదే లగేజీ ఆటో మరోచోట ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డారు. ఈ రెండు ఘటనలూ గురువారం పుంగనూరులో చోటుచేసుకున్నాయి. మండలంలోని ఏడూరుకు చెందిన మహిళా సంఘ సభ్యులు బ్యాంకులో రుణం తీసుకోవడానికి గ్రామం నుంచి ఆటోలో పుంగనూరుకు వస్తుండగా బ్రాహ్మణవీధిలో ఎదురుగా లగేజీ ఆటో అతివేగంగా వస్తూ ప్రయాణికుల ఆటోను ఢీకొంది. ఆటో ప్రయాణిస్తున్న మహిళా సంఘసభ్యులు కళావతి, ఈశ్వరమ్మ, లీలావతి, సుజాత, రమణమ్మ, అన్వేష్ గాయపడ్డారు. ఆటో డ్రైవర్ జీవరత్నానికి సైతం గాయాలయ్యాయి. అదేవిధంగా పెంచుపల్లెకు చెందిన గోపీనాథ్, అతని భార్య అకీల గర్భవతి కావడంతో పరీక్షల నిమిత్తం కుమారుడు దేవాన్ష్‌లతో కలసి ప్రభుత్వ ఆస్పత్రికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా అదే లగేజీ ఆటో ఢీకొంది. ఈ ఘటనలో గోపీనాథ్ తీవ్రగాయాల పాలయ్యాడు. స్థానికులు వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

కల్లూరు, సెప్టెంబర్ 5: పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లి పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లి సమీపంలో గురువారం పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10,730 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ ఎత్తిరాజులు తెలిపారు.

విశ్రాంత అధ్యాపకులకు సన్మానం



సోమల, సెప్టెంబరు 5: స్థానిక కేవీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశ్రాంత అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఇటీవల పదవీ విర మణ చేసిన అధ్యాపకులు సత్యనారాయణ, మునిరాజనాయుడులకు అధ్యాపకులు జ్ఞాపికలు అందజేశారు. నంజంపేట, సోమల, తుగడం వారిపల్లె, వడ్డిపల్లె, కందూరు పాఠ శాలల్లో ఉపా ధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొల్లా కోటీశ్వరరావు, అధ్యాపకులు గౌతం, రవీంద్రారెడ్డి, శివయ్య, నాగరత్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు భావి సమాజ నిర్మాతలు


హెచ్‌ఎం శ్రీవాణిని సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరు, సెప్టెంబరు 5: ఉపాధ్యాయులు భావి సమాజ నిర్దేశకులు అని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాలాజి, జిల్లా వాసవీ క్లబ్ కేబినెట్ కార్యదర్శి వినయ్ కుమార్ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీవాణి అధ్యక్షతన గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని దుశ్శాలువ, పూలమాలలతో సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి పాదపూజ



రొంపిచెర్ల, సెప్టెంబరు5: మండలంలోని చెంచమ రెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుడు రాజా జయప్రకాష్‌కు గురుపూజోత్సవం సందర్భంగా పాద పూజ చేశారు. గురువు గొప్పతనాన్ని చాటి చెప్పే పద్యాలను ఆలపించారు.

పార్టీని బలోపేతం చేయాలి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు5: గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని రాయలసీమ జోన్ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ సూచించారు. గురువారం పుంగనూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు విజయశంకర్, నానబాల కుమార్, బాబు, రెడ్డిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా మట్టి విగ్రహాలు



పుంగనూరు రూరల్, సెప్టెంబరు5: స్థానిక విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు


సీనియర్ టీచర్లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పుంగనూరు, సెప్టెంబరు5: సమాజాన్ని నిర్దేశించే శక్తి సామర్థ్యాలు ఉపాధ్యాయులకు ఉందని ఎంఈవోలు చంద్రశేఖర్, రెడ్డెన్నశెట్టి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ ప్రగతి భవన్‌లో ఘనంగా డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు మోహన్‌యాదవ్, హరి, కిషోర్‌రెడ్డి, శ్రీధర్, మంజునాథ్, సుధాకర్, దీపారాణి, శిల్ప, సుమల, విజయశ్రీ, మాధవి, గంగులమ్మ, షాహీన, రాధామణి పాల్గొన్నారు.

'అవినీతి వీవోలు మాకొద్దు'


సమావేశంలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షులు బాబు

గుడుపల్లె, సెప్టెంబరు5: 'అవినీతి వీవోలు మాకొద్దు 'అంటూ గుడుపల్లె పంచాయతీ గ్రామ సమైక్యలోని మహిళా గ్రూప్ సభ్యులు నిరసన తెలియజేశారు. గురువారం స్త్రీశక్తి భవనంలో మండల సమైక్య సమావేశం జరిగింది. మహిళ సభ్యురాలు దేవి మాట్లాడుతూ అభయ అహస్తం డబ్బులను వీవోలు కొందరితో కుమ్మక్కై లక్షల్లో దిగమింగారని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. అధికారులు వీవోలతో కుమ్మక్కవడమే దీనికి కారణమన్నారు. వైసీపీ కార్య కర్తలుగా ఇద్దరు వీవోలు పని చేశారని పేర్కొంది. గ్రూప్ సభ్యులకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తే ఇద్దరు వీవోలు సభ్యుల నుంచి వేలల్లో డబ్బులు వసూలు చేశారని తెలియజేశారు. మరో గ్రూప్ సభ్యురాలు రత్నమ్మ మాట్లాడుతూ అవినీతి వీవోలపై విచారణ చేపట్టాలని టీడీపీ మండల అధ్య క్షుడు బాబు ఎదుట మహిళా గ్రూప్ సభ్యులు వాపోయారు. ఆ తరువాత గుడుపల్లె-1కు వీవోగా చంద్రకళను, గుడుపల్లె-2కు భవానిని గ్రూప్ సభ్యులు ఎన్నుకొన్నారు. ఏపీఎం శ్రీనివాస్, మండలాధ్యక్షుడు అమీర్ నాయకులు హేమాంబర్ గౌడ్, సుబ్రహ్మణ్యం, గోపాల్, భానుమూర్తి, లక్ష్మీపతి పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

రీసర్వేలో అవకతవకలను సరిదిద్దండి


జేసీకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెం బరు 5: గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన భూ రీసర్వేలో చోటుచేసుకున్న అవకత వకలను సరిదిద్దాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ కోరారు. గురువారం వారిరువురు కలెక్టరేట్‌లో జేసీ విద్యాధరిని కలిసి వినతిపత్రం అందజేశారు. రీసర్వే వల్ల పట్టాదారు పాసు పుస్తకాల్లో రైతుల పేర్లు తప్పుల తడకగా నమోదయ్యాయని తెలిపారు. భూ విస్తీర్ణంలోనూ పొరపాట్లు జరిగాయని ఆరోపించారు.

రూ.11.90 కోట్లతో సిమెంట్ రోడ్లు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 5: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నియోజకవర్గానికి రూ.11.90 కోట్లతో సిమెంట్ రోడ్డు పనులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ శాఖ డీఈఈ ఆనందరెడ్డి తెలిపారు. జీడీనెల్లూరు మండలానికి రూ.1.59 కోట్లు, కార్వేటినగరానికి రూ.4 కోట్లు, పాలసముద్రానికి రూ.70 లక్షలు, పెనుమూరుకు రూ.2.11 కోట్లు, ఎస్ఆర్ పురానికి రూ.1.75 కోట్లు, వెదురుకుప్పానికి రూ.1.75 కోట్ల పనులు మంజూరైనట్లు వెల్లడించారు. అదేవిధంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు నిధుల కింద నియోజకవర్గానికి రూ1.50కోట్లు మంజూర య్యాయని, త్వరలో పనులు ప్రారంభమవు తాయని తెలిపారు.

30 లీటర్ల సారా స్వాధీనం

గుడిపాల, సెప్టెంబరు 5: మండలంలోని వెంగమాంబాపురం పంచాయతీ ఒ.వెంకటాపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో గురువారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించగా 30 లీటర్ల సారా, 600 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. పరారైన నిందితులను త్వరలోనే పట్టుకుంటా మన్నారు. గ్రామాల్లో సారా తయారీ, విక్రయ సమాచారం తెలిస్తే పోలీసులకు చెప్పాలని కోరారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం



చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 5: విజ యవాడ వరద బాధితుల సహాయార్థం చిత్తూరు మాజీ కౌన్సిలర్ పార్థసా రథినాయుడు రూ.లక్ష విరాళం అందజే శారు. గురువారం కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో జేసీ విద్యాధరిని కలిసి చెక్ అం దజేశారు. ఆయన దాతృత్వాన్ని జేసీ అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గుడిపాల, సెప్టెంబరు 5: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, క్వారీ యజ మానులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని జేసీ విద్యాధరి అన్నారు. మండలంలోని సింగారపేటలో గురువారం పబ్లిక్ హియరింగ్ (పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ) సమావేశాన్ని జేసీ అధ్యక్షతన నిర్వహించారు. మొక్కలు నాటడం, వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడం, గ్రామాల్లో సీసీ రోడ్లు వేయడం వంటి వాటిపై క్వారీ యజమానులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఐ రామసాయి, వీఆర్వోలు పాల్గొన్నారు.

'వేము' ప్రిన్సిపాల్‌కు ఉత్తమ అవార్డు


నవీన్‌ను సన్మానిస్తున్న జేఎన్టీయూ బృందం

పూతలపట్టు, సెప్టెంబరు 5: మండలం లోని వేము ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ కిలారి ఉత్తమ అవార్డు అందుకు న్నారు. జేఎన్‌టీయూ యూనివర్సిటీ అనంత పురం బృందం గురువారం ఆయన్ను ఘనంగా సన్మానించింది. కళాశాల ఛైర్మన్ చంద్రశేఖర్, అధ్యాపకులు, సిబ్బంది ఆయన్ను అభినందించారు.

నగరి ఆర్టీవోగా శివకుమార్



నగరి, సెప్టెంబరు 5: నగరి ఆర్టీవోగా శివకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రోడ్డు భద్రతపై పటిష్ఠ చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవిం గ్ లైసెన్సులపై తరచూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. పాఠశాల వాహనాలకు ఫిట్‌నెస్ తప్పనిసరి అన్నారు.

విద్యార్థులు విరాళాల సేకరణ



పూతలపట్టు, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పూతలపట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం విరాళాలు సేకరించారు. మండల కేంద్రంలోని దుకాణాల వద్దకు వెళ్లి వరద బాధితుల కోసం సాయం చేయాలని కోరారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.9.6 లక్షలు

నగరి, సెప్టెంబరు 5: దేశమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.9,66,544 వచ్చినట్లు ఈవో రామచంద్రారెడ్డి తెలిపారు. మూడు నెలలుగా వచ్చిన కానుకలను ఈవో సమక్షంలో గురువారం లెక్కించారు. నోట్ల రూపంలో రూ.8,44,976, చిల్లర రూపంలో రూ.1,21,568 వచ్చిందని ఈవో వివరించారు. లెక్కింపులో దేవదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పండగను ప్రశాంతంగా జరుపుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటరెడ్డి

నగరి, సెప్టెంబరు 5: వినాయకచవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆర్డీవో వెంకటరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆయన వినాయక ఉత్సవ కమిటీల వారితో సమావేశమ య్యారు. మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసర న్నారు. విద్యుత్, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విగ్రహం ఎత్తు, నిమజ్జనం తేదీ వంటి వివరాలను తెలిపి అనుమతి తీసుకోవాలన్నారు. సీఐ మహేశ్వర్, ఎంపీడీవో లీలామాధవి, రూరల్ సీఐ భాస్కర్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

వెదురుకుప్పం, సెప్టెంబరు 5: వినాయక చవితి ఉత్సవాలకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య గురువారం రాత్రి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా అనుమతి పొందవచ్చునని, అలా చేయడం తెలియని వారు నేరుగా పోలీసుస్టేషన్‌లో సంప్రదించి పొందాలని కోరారు.

13న వారపు సంత వేలం

వెదురుకుప్పం, సెప్టెంబరు 5: పచ్చికాపల్లం వారపు సంతకు ఈనెల 13న ఉదయం 11 గంటలకు గ్రామ సచివాలయం వద్ద వేలం పాట నిర్వహిస్తున్నట్లు సచివాలయ డీడీవో మోహన్‌కుమార్ గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.20వేలు ధరావత్తు చెల్లించాలని, సర్కారు పాట రూ.80వేలని వెల్లడించారు.

చదువులు ఉన్నత స్థితికి చేర్చుతాయి

ఉపాధ్యాయ దినోత్సవంలో కలెక్టర్ సుమిత్ కుమార్




కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను సన్మానిస్తున్న తేజోమూర్తి - ఎస్ఆర్‌పురంలో సన్మానిస్తున్న ఎమ్మెల్యే థామస్ - బంగారుపాళ్యంలో ఎమ్మెల్యే మురళీమోహన్

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 5: చదువులు వ్యక్తిని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చుతాయని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయం విద్యా సంస్థల అధినేత తేజోమూర్తి, డైరెక్టర్ శైలజామూర్తి అధ్యక్షతన విజయం డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కలెక్టర్‌తో పాటు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నెక్ రమేష్ ఆధ్వర్యంలో పలువురికి కోడిగుడ్ల తోపుడు బండ్లు పంపిణీ చేశారు.

పాఠశాలల్లో.. : నగరంలోని పలు పాఠశాలల్లో గురువారం గురుపూజోత్సవం, చవితి వేడుకలు నిర్వహించారు. బృందావన్ పాఠశాలలో కరస్పాండెంట్ శైలజాకుమారి, డైరెక్టర్ ప్రియతేజ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యా యులను సత్కరించి, మట్టి ప్రతిమలనే పూజిం చాలని పర్యావరణంపై అవగాహన కల్పించారు. రాంనగర్ కాలనీలో హార్వర్డ్ స్కూల్‌లో కరస్పాం డెంట్ భాస్కర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరిం చారు. గిరింపేట దేవి పాఠశాలలో కర స్పాండెంట్ ప్రసాద్ ఉపాధ్యాయులను సన్మానించారు.

పాలసముద్రం : పాలసముద్రం ఎమ్మార్సీ కార్యాలయంలో మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు ప్రశంసా పత్రాలు అందజేసి, ఘనంగా సత్కరించారు.

వెదురుకుప్పం : కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు సోమసుందర పిళ్లై, సుధాకర్, సుబ్రహ్మణ్యంలను సత్కరించారు. సర్వేపల్లి చిత్రాన్ని పాఠశాల ప్రాంగణంలో రంగులతో చిత్రించారు. గురువులకు వందనం అంటూ విద్యార్థులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. హెచ్ఎం కేశవులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు : టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీవో ఆఫీస్‌లో టీచర్స్‌డే నిర్వహించారు. జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీతలు వరదయ్య, జ్యోతిలను సన్మానించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన టీచర్లకు బహుమతులు అందజేశారు. కడపగుంట స్కూల్లో 36 ఏళ్ల పాటు విద్యా బోధన చేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు దామోదర్‌రెడ్డిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. వెండి ప్లేట్, వెండి గ్లాస్, బంగారు ఉంగరాలు అందజేసి పాదాలకు పాలాభిషేకం చేశారు. విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు.

పెనుమూరు : ఎమ్మార్సీ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈవోలు రాజేంద్ర, భాస్కర్‌నాయుడు, మాజీ జడ్పీటీసీ రుద్రయ్యనాయుడు, తహసీల్దారు కళావతి, జడ్పీటీసీ దొరస్వామియాదవ్ పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం : మండల విద్యా వనరుల కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సన్మానించారు. వరద బాధితులకు ప్రతి ఒక్కరూ సహాయం అందించాలని కోరారు. తనవంతుగా రూ.50లక్షలు ప్రకటించారు. దేవళంపేట స్కూల్ యజమాని గుణశేఖర్ రూ.25వేలు ఎమ్మెల్యేకు అందించారు. ఎంఈవోలు అరుణాచాలంరెడ్డి, సబరమతి, తహసీల్దార్ అమరనాథ్, ఏవో కృష్ణయ్య, ఎస్ఐ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె : ఎంపీడీవో కార్యాలయం వద్ద సర్వేపల్లె రాధాకృష్ణన్ చిత్రపటానికి పూజలు చేసి, నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మురళీమోహన్ ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. తహసీల్దార్ సుధాకర్, ఎంఈవోలు హేమలత, త్యాగరాజులురెడ్డి, ఎస్ఐ చిరంజీవి పాల్గొన్నారు.

గుడిపాల : నరహరిపేట జడ్పీ హైస్కూల్, బొమ్మసముద్రం హైస్కూల్‌లో ఉపాధ్యాయులను జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, ఎంఈవో గణపతి సత్కరించారు. మండలంలోని పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. హెచ్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

పూతలపట్టు : ఎమ్మార్సీ భవనంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎస్పీ బాషా, మమత, యశోద, జ్ఞానశేఖర్ నాయుడు, దామోదర్ శెట్టి, రమేష్, శ్వేత, గీత, గాయత్రిలను సన్మానించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

విజయపురం : మండల విద్యావనరుల కార్యాలయంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, బహుమతులు ఇచ్చారు. ఉద్యోగ విరమణ చేసిన ఎంఈవో ఆంజనేయులు, కైలాసం యాదవ్, ఉపాధ్యా యులను సత్కరించారు.

బంగారుపాళ్యం : ఎంఈవో కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మురళీమోహన్ ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. జ్ఞాపికలు అందజేశారు. ఈశ్వర్ కల్యాణ్ అభయం ట్రస్టు అధినేతలు ఈశ్వర్ నాయుడు, కల్యాణ్ ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈవోలు నాగేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

నింద్ర : ఎంపీడీవో కార్యాలయంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. ఎంపీపీ దీప హాజరై వారికి ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న నింద్ర మండల నెట్టేరి గిరిజన పాఠశాల ఉపాధ్యాయురాలు రామమ్మను ఎంపీపీ దీప, మండల స్థాయి అధికారులు సన్మానించారు. ఎంపీడీవో అరుణ, ఎంఈవోలు వసుమతి దేవి, శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.

నగరి : పెన్షనర్స్ భవనంలో ఎంఈవో శ్రీదేవి ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. సీఐ మహేశ్వర్, ఎంఈవో నమశ్శివాయం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విరాళాల సేకరణ




చిత్తూరు సిటీ, సెప్టెంబరు 5: టీడీపీ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు విరాళాల సేకరణ కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని జీజేఎం కార్యాలయంలో ట్రస్ట్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడుకు టీడీపీ నేతలు సేకరించిన విరాళాలను అందించారు. వడ్డెర సంఘం నేతలు ధరణి ప్రకాష్, ఏఎస్ బాబు, మణికంఠ, మురళి, విజయ్‌కుమార్, వెంకటేష్ ఆధ్వర్యంలో 20 బస్తాల బియ్యం, 50 లీటర్ల వంట నూనె, కూరగాయలు, బిస్కెట్ ప్యాకెట్లను టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు చేతుల మీదుగా ట్రస్ట్ నిర్వాహకులకు అందించారు. విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సేకరించిన వస్తువులనూ అందజేశారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం : గురజాల


వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, వారికి అన్ని విధాలా సాయం చేస్తోందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం విజయవాడలోని 16వ వార్డు కృష్ణలంక పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. వరద బాధితుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించారు.

దిగజారుడు రాజకీయాలు తగవు : టీడీపీ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 5: విజయవాడ వరదలపై మాజీ సీఎం జగన్, వైసీపీ నేతలు దిగజారుడు రాజకీయాలు చేయడం తగదని టీడీపీ నేతలు అన్నారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డుతుంటే వైసీపీ నేతలు బురద రాజకీయం చేయడం బాధాకర మన్నారు. బుడమేరు గేట్లు ఎత్తివేయడం వల్లే విజయవాడ మునిగిపోయిందని జగన్ ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మానేసి రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయండి

పెనుమూరు, సెప్టెంబరు 5: గ్రామాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు విద్యుత్ ఏఈ తులసిప్రసాద్‌ను కోరారు. గురువారం పెనుమూరు విద్యుత్ కార్యాలయంలో వినియోగదారుల సమస్యల పరిష్కార సమావేశం నిర్వహించారు. రైతులు, ప్రజలు తమ సమస్యలను ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. వీధిలైట్ల విషయమై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. తాగునీరు బోర్లకు నిరంతర విద్యుత్ అందించాలని విన్నవించారు. సమస్యలను పరిష్కరిస్తానని ఏఈ హామీ ఇచ్చారు.

సీహెచ్‌పీలో రాత్రిపూట డాక్టర్

పెనుమూరు, సెప్టెంబరు 5: పెనుమూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రాత్రిపూట డాక్టర్ అందుబాటులోకి వచ్చారు. రాత్రిపూట డాక్టర్ లేకపోవడంతో వైద్యం కోసం చిత్తూరు, తిరుపతికి వెళ్లాల్సి వస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు రుద్రయ్యనాయుడు కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి రాత్రిపూట డాక్టరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డాక్టరేట్ ప్రదానం



ఐరాల, సెప్టెంబరు 5: మండలంలోని పరసరెడ్డిగారిపల్లె గిరేంద్రరెడ్డి బెంగళూరు భారత్ వర్చువల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. 20 సంవత్సరాలుగా బెంగళూరులోని ఏఎస్‌సీ కాలేజ్‌లో హెచ్‌వోడీగా విద్యా రంగంలో ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా గతనెల 24వ తేదీ డాక్టరేట్ అందజేశారు.

మట్టి వినాయకులే సంస్కృతికి ప్రతిబింబం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 5: మట్టి వినాయకులే హైందవ సంస్కృతికి ప్రతిబింబమని నగర మేధావుల ఫోరం ప్రతినిధులు తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు మట్టి వినాయక పూజలపై గురువారం అవగాహన కల్పించారు. మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు.

11న చేపల చెరువు వేలం

వెదురుకుప్పం, సెప్టెంబరు 5: వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు గ్రామ పంచాయతీ బుచ్చిరెడ్డికండ్రిగ చేపల చెరువుకు ఈ నెల 11వ తేదీన ఉదయం 11 గంటలకు ఆళ్లమడుగు రచ్చబండ వద్ద వేలం పాట నిర్వహిస్తున్నామని ఆళ్లమడుగు గ్రామ సచివాలయ ఇన్‌చార్జి డీడీవో మోహన్‌కుమార్ గురువారం రాత్రి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.17500 ధరావత్తు చెల్లించాలని చెప్పారు. సర్కారు పాట రూ.70 వేలుగా నిర్ణయించామని చెప్పారు.

తాగునీటి బోర్లకు క్లోరినేషన్ పరికరాలు

పాలసముద్రం, సెప్టెంబరు 5: పాలసముద్రం పంచాయతీలో బోర్లకు క్లోరినేషన్ పరికరాలు ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ధరణీ ప్రసాద్ తెలిపారు. తద్వారా తక్కువ ఖర్చుతో నీటిని క్లోరినేషన్ చేయవచ్చని పేర్కొన్నారు.